# దీపం చమురు

అధరాపురపు తేజోవతి

"రాధా! ఎందుకిలా చేశావ్?"

కథలోని ఆ డైలాగు సూటిగా తననే అడిగినట్లయింది వారపత్రిక చదువుతున్న రమణికి.

ఆమె కన్నులనుంచి జారిన ముత్యాల్లాంటి అశ్రుబిందువులు, గులాబీ రేకుల్లాంటి ఎర్రని బుగ్గలమీంచి జారి క్రిందపడ్డాయి...

చదువుకున్న వారపత్రికను మూసేసి కళ్ళొత్తుకున్నది రమణి. ఆమె కళ్ళముందు చదివిన కథ గిర్రున తిరిగింది...

రాధా మనోహరులు అన్యోన్యం ప్రేమించుకున్నారు... రాధే లోకమయింది మనోహర్‌కు.. ఒకరిని విడిచి ఒకరం వుండమని ఎన్నోప్రమాణాలు చేసుకున్నారు...ప్రతి సాయంత్రం కలిసి బీచి ఒడ్డున కూచుని ఎన్నోకబుర్లు చెప్పుకునే వాళ్ళు. ...ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకుంటూ తన్మయులయ్యేవారు... ఆ ప్రేయసీ ప్రియుల్ని చూచి సముద్రుడే పొంగిపరవళ్ళు తొక్కేవాడు. ... ఆనందోద్రేకం తోవచ్చి వాళ్ళపాదాలను తాకేవాడు... వారి ఆనందాన్ని చూడలేక కన్నుకుట్టిన కమలబాంధవుడే మొహంచాటు చేసుకుని వెళ్ళిపోయేదాకా వారీ లోకంలోకి వచ్చేవారుకారు.

ఈ తియ్యని ప్రేమబంధాన్ని పవిత్రమైన వివాహబంధంతో శాశ్వతం చెయ్యాలని యిద్దరూ వువ్విళ్ళూరారు,

కాలేజీలు మూసేశారు...వేసంకాలం సెలవులు వాళ్ళపాలిటి శత్రువుల్లా వచ్చిపడ్డయి... విడవలేక విడవలేక విడిచి పొయ్యారు ప్రేమికులు...

మళ్ళీ కాలేజీలు తెరిచే సరికి రాధ రాలేదు... రాధ స్నేహితురాలు చెప్పింది..'రాధకు పెళ్ళయిపోయిందిట...అతడు బాగా చదువుకున్నవాడే అందగాడు, ఆ స్తిపరుడు...మంచి వుద్యోగస్థుడు కూడానట...పెళ్లిలో కూడా రాధ చాలా సంతోషంగా సంతృప్తిగానే కన్పించిందిట...పైగా యీ పెళ్ళి తను యిష్టపడి చేసుకున్నదే నన్నదట!...

ఇక వినలేక పొయ్యాడు మనోహర్... ఇంచుమించు పిచ్చివాడే అయ్యాడు...తనను చూచి వెనక్కి వెళ్ళిపొయ్యే ప్రతి అలనూ, తన రాకతో తలవంచిన పార్కులోని ప్రతి పువ్వునూ చూసినప్పుడల్లా అతడిలా అడిగేవాడు "రాధా!.. ఎందుకిలా చేశావ్?..."

"పాపం......" అనుకోకుండా రమణి నోట వెలువడిందా మాట ...ఇంతలో బయటబూట్ల చప్పుడు భర్తరాకను తెల్పుతూ విన్పించింది... ఒకసారి దీర్ఘంగా నిశ్వసించి, కళ్ళు తుడుచుకుని లేచి నిలబడింది...

రమా!.....నీకో శుభవార్త.....అన్నట్లు యిదేమిటి యిలాగే వున్నావ్.....వెళ్ళు...వెళ్ళి యీ వాయిల్‌చీర మార్చేసి మంచిచీర కట్టుకో... చక్కగా 'డ్రెసప్'అయిరా...ఇదో ఆపనిమనిషిని పిలు...మన తోటలోవున్న ఎర్రగులాబీలునాలుగు కోసుకు రమ్మను.....ఈ వేజ్‌లో పెడదాం..... ఏమ్‌పిల్లా......యీ ఒంటిజడ విప్పేసి, రెండు జడలు వేసుకుని, ఎర్రగులాబీలుపెట్టుకో...... అదుగో ఆ 'పింక్' కలరు చీరె...నీకు చాలా బాగుంటుంది......ఆ చీరలో పువ్వుల రాణిలా వుంటావు నువ్వు...అది కట్టుకో...ఊఁ...యిక వెళ్ళు.....యింకా యిక్కడే వున్నావ్...... అన్నట్లు... ఈ పూట టిఫిన్ ఏంచేశావ్?..."

ఏకధారగా చెప్పుకుపోతున్న భర్తహడావుడికి నవ్వుకుంటూ. "ఇవ్వేళ మీ కిష్టమని పకోడీలు చేశాను కానీ......ఏమిటీ హడావుడి?...... సినిమాకా?..." మురిపెంగా అడిగింది రమణి...

"సినిమా!......ఓహ్ సినిమా కాదోయ్.... మనింటికి ఒకరు రాబోతున్నారు...నీకు చాలా చాలా యిష్టమైనవాళ్ళు....నువ్వెంతో అభిమానించేవాళ్ళు."

"ఎవరబ్బా అది... మీ తమ్ముడుగారా?..."

"ఊఁ హుఁ."

"మా అన్నయ్య."

"అబ్బ...కానే కాదు...అన్నట్లు టిఫిన్ మాట మర్చిపొయ్యాను... పకోడీలు చేశావ్ కదూ...కొంచెం స్వీట్ చెయ్యగలవా ?... అహఁ. వద్దులే...యిప్పుడు టైమ్ లేదు... నువ్వింకా రెడీ అవాలిగా...సీతాలూ... సీతాలూ...అర్జంటుగా హోటలుకు వెళ్ళి... అరడజను మైసూర్‌పాక్ బిళ్ళలూ...కిళ్ళీలూ పట్టుకొచ్చేయి... ఇదిగో... త్వరగా రావాలి సుమా యిక్కడున్నట్లు వచ్చెయి...అరె యింకా యిలాగే కూచున్నావేం...యింక పావుగంటలో అతడొచ్చేస్తాడు...త్వరగా రెడీ అవు."

"ఇంతకూ ఆ ఆగంతుకుని నామధేయం సెలవియ్యనేలేదు" రమ జ్ఞాపకం చేసింది...

"సస్పెన్సు స్వీట్...సస్పెన్సు...ఆ నక అతను వచ్చాక పరిచయం చేసినప్పుడు, నువ్వు ఆశ్చర్యంతో. ఆనందంతో తబ్బిబ్బయి...ఓహ్ అప్పుడే యిప్పుడే నామధేయం చెప్పబడదు."

అయితే మానుకోండి...నేను లేవనుగాక లేవను...చీర మార్చుకోను సరికదా...చేసిన పకోడీలు మీకు మాత్రం అన్ని వుంచి, మిగతావన్నీ నేనే తినేసి, ఆయన రాగానే. యీ కళ్ళు యిలా పెట్టి, జుట్టు విరబోసుకుని, మీ సస్పెన్సును యింకా రక్తికట్టేలా చేస్తాను." పెంకిగా అంది రమణి...

పెంకిపిల్లా.....ఆ వచ్చేది ఎవరోకాదు.... 'నీ' అభిమాన (పోనీ 'నా' అని కూడా అంటాను) రచయిత మురళీధర్...అతడు వ్రాసిన కథకు బహుమతి వచ్చిన సందర్భంలో యీ వూళ్ళో సన్మానసభ ఏర్పాటు చేశారు...నా ఫ్రెండ్ వచ్చి చెబితే, అనుకోకుండా వెళ్ళాను...ఆ మీటింగ్ అయ్యాక 'నా శ్రీమతికి మీ రచనలంటే చాలా యిష్టం...ఒక్కసారి మా యింటికి రమ్మం' టే 'సరే' నన్నాడాయన...ఇంకో స్నేహితుడ్ని చూచి, బదున్నరకల్లా వచ్చేస్తానన్నాడు," పనిపిల్ల తెచ్చిన పూలు 'వాజ్' లో సర్దుతూ చెప్పకుపోతున్నాడు మహేష్...

'మురళీధర్' అన్న పేరు విన్న రమణి, ఎలక్ట్రిక్ షాక్‌తిన్న దానిలా నిశ్చేష్టిత అయింది.. నోట మాట రాలేదు...శరీరం యావత్తూ సత్తువ వుడిగి కూలబడేటట్లుగా వుంది...చిరుచెమటలు పోస్తున్నాయి...

ఇక అక్కడ వుంటే ఏమి జరుగుతుందోనని, పక్క గదిలోకి వెళ్ళిపోయి, మంచం మీద వాలిపోయింది......

హే భగవాన్ !...ఏమిటిది ?...ఏం జరగబోతోంది ?...

అతడు వచ్చి ఏ మంటాడు ?...

"రమణీ ! ఎందుకిలా చేశావ్." అంటాడా ?...

ఏం చెప్పాలి తను ?...భర్త ఏమంటాడు ?

ఆ షాక్‌నుండీ రమణి యింకా తెప్పరిల్లుకోనే లేదు రమణి... పనిపిల్ల స్వీట్సు, కిళ్లీలు తెచ్చి పెడుతూనేవుంది... భర్త కుర్చీలన్నీ సరిగా సర్దుతునే వున్నాడు...

బయట రిక్షాఆగిన చప్పుడైంది!...

రమణి గుండెలు కొట్టుకోటం ఆగినట్లయింది...

"రండి...రండి... త్వరగానే యిల్లు కనుక్కోగలిగా రనుకుంటానే. ప్రక్కగదిలో మహేష్ ఆహ్వానం...

"ఆఁ...మీరు వివరంగా అడ్రసిచ్చారుగా..."

అవును ...అది అతడిగొంతే... సందేహం లేదు...

ఇప్పుడు తనేంచేయాలి?...

పారిపోతే?...

ఊహుఁ ... లాభం లేదు... దొడ్డిగుమ్మం దగ్గరకు పోవాలంటే హాల్లోంచే వెళ్ళాలి... హే భగవాన్!... నా గుండె సడన్‌గా ఆగిపోతే ఎంత బావుండు... ఈ గదికూలిపోయి నేను ఆ కప్పుక్రింద సజీవ సమాధి అయిపోగలిగితే...

"రమా!... అయ్యో... అదేమిటి యింకా యిలాగే వున్నావ్... ఇందాకట్నుంచి ఏంచేస్తున్నట్లు?...మొండీ! చీరమార్చమంటే మార్చనే లేదుగదూ...లే అతడువచ్చాడు రా...పరిచయం చేస్తాను" అంటూ ఆ గదిలోకి వచ్చాడు మహేష్...

బిడాయన లేచికూర్చుంది రమణి...

"వొద్దండి... నాకొంట్లో బాగుళ్ళేదు ...తల పగిలిపోతోంది...అందులో నాకు భయంగాకూడా ...వద్దు." అర్థిస్తున్నట్లు చాలామెల్లిగా అడిగింది...

"ఛీ ......భయమా!...... పైగా కాలేజీలో కూడా చదివావు ... ...నవ్వుతారు ఎవరన్నా వింటే...లే......లేచి ప్లేటుల్లో సర్ది పెట్టు వీటిని......నే వెళతాను...అవతల పెద్దమనిషి వచ్చి కూర్చుంటే...ఏమిటీ పంతం?" విసుక్కున్నాడు మహేష్...

మహేష్ వెళ్ళిపొయ్యాడు. మళ్ళీ హాల్లోకి...

రమణి మెల్లిగా లేచి ప్లేటులో సర్దుతోంది...

"రమా...రమా..." మళ్ళీ హాల్లోంచి భర్త పిలుపు...

ఇక తప్పదన్నట్లుగా ట్రే తీసుకుని బయలు దేరింది...

గుండెలు గుబగుబ కొట్టుకుంటున్నాయి...

అడుగులో అడుగేసుకుంటూ తల వంచుకు వెళ్ళింది రమణి...

ప్రక్కకు తిరిగి నవ్వుతూ మహేష్‌తో మాట్లాడుతున్నాడు మురళీధర్...

"షి ఈజ్ మై మిసెస్..." పరిచయం చేస్తూ అన్నాడు మహేష్...

"నమస్తే!....." ఇటు తిరుగుతూ చేతులు జోడిస్తున్న మురళీధర్ లేచి ప్లేటు అందివ్వబోయిన రమణి చూపులూ కలుసుకున్నాయి...

జోడించబోయిన చేతులు విడిపోయినయి అతడికి...

బితుకు బితుకు మంటూ చూచింది రమణి...

"రమణీ!....నువ్వా!....నువ్వు...మీ...రు..." అప్పుడే మూర్ఛలోంచి తేరుకున్నట్లుగా అస్తవ్యస్తంగా వున్నయి అతడిమాటలు...

ప్రేమా, బాధా, అతడు నిగ్రహించుకోలేని ఏదో వెర్రి ఆవేశం.........అతడ్ని అవశుడ్ని చేసేశాయి...

పిచ్చివాడిలా లేచాడు... రమణి అందిస్తున్న ప్లేటును పక్కకునెట్టి, ముందు వెనుకలు ఆలోచించకుండా లేచి "వస్తాను." అంటూ ఒక్క అంగలో వాకిట్లోకి వెళ్ళిపొయ్యాడు మురళీధర్.

రమణి ముఖంలో నెత్తురు చుక్కలేదు...

ప్రళయ ఝంఝూమారుతానికి వూగిపొయ్యే చెట్టులావుంది రమణి శరీరస్థితి... కంపించే చేతుల్లోంచి జారి క్రిందపడి తునాతునకలైంది పింగాణీప్లేటు... మహేష్ స్థంభించిపోయినట్టు చూస్తున్నాడు.

అతడు యధాస్థితికి రావడానికి కొన్ని నిముషాలు పట్టింది...

తలలోంచి తేరుకున్నట్లు తేరుకుని చూస్తే, ఎదుట పగిలిపోయిన ప్లేటు.. గదిలో వెక్కి వెక్కి ఏడుస్తున్న రమణి... దూరంగా కదిలి పోయిన రిక్షాగంట చప్పుడు...

నిద్రలోంచి లేచినట్లు లేచాడు .. కానేపు అయోమయంగా అనిశ్చితంగా నిలబడ్డాడు... తర్వాత ఏదో తోచినట్టు తలుపులు దగ్గరకు చేరేసి సైకిలుతీసుకు బయలుదేరాడు...

అతడు ముందు మురళీధర్‌ను పరిచయం చేసిన స్నేహితుడి యింటికి వెళ్ళాడు... అతడ్ని అడిగి మురళి బసచేస్తున్న యింటికి వెళ్లాడు...

వాళ్ళు "యిప్పుడే వూరికి వెళ్ళిపోయ్యారండి" అని చెప్పారు...

"అంత అర్జంటుగా ఎందుకు వెళ్ళిపోవల్సి వచ్చిందండీ?" అని అడిగాడు మహేష్...

"ఏమోనండి... మా కేం తెలుసు ... అడిగితే... "రాధా! ...ఎందుకిలా చేశావు?" కథలో రాధ కనిపించింది ... అన్నాడు... పిచ్చిగాకపోతే కథలో పాత్రలు కన్పడతాయిటండీ ఎక్కడన్నా... ఈ రచయితలకు వేవకాయంత వెర్రి కూడా వుంటుందేమో..." అన్నారు ఆ యింటి వాళ్ళు...

రాధ కన్పించింది...రాధ కన్పించింది!

ఆ మాట చెవుల్లో గింగురు మంటుంటే తిరుగు ముఖం పట్టాడు మహేష్.....ఇంటికి పోబుద్ధి పుట్టలేదు...సైకిల్ తొక్కడానికి కూడా వోపిక లేనట్లుంది...దోవలో ఆఫీసు ప్యూను కనబడితే సైకిల్ యింటిదగ్గర పడెయ్యమని అప్పజెప్పి తను వెళ్ళి పార్కులో సిమెంటు బెంచీమీద కూలబడ్డాడు.

రాధ కన్పించింది!...ఎవరు?...తన భార్య రాధ!....మనోహర్‌ను మోసం చేసిన రాధ... ఎవరోకాదు తన భార్య రమణి!... అందుకేనా అతడు వస్తానంటే అంతగా కంగారుపడి పోయింది?...ఇవ్వాళ ఆఫీసులో కథ చదివాక దానిమీద డిస్కషన్ జరిగింది......రాధలాంటి వాళ్ళు ఎవ్వరూ వుండరు...అన్నారు అంతా...

కానీ వుంది...తన భార్యే వుంది!...

తన ప్రాణమనుకున్న భార్య, మనసూ,తనువూ తనవే అనుకున్నభార్యే, ఒకరి జీవితంలో నిప్పులు చల్లి, తన జీవితంలో పన్నీరు చల్లినట్టు నటిస్తోంది!...

మనోహర్‌ను మోసం చేసిన రాధ...

మురళీధర్‌నూ, ఒకవిధంగా తననూ మోసం చేస్తున్న రమణి...ఇద్దరి రూపాలూ మార్చిమార్చి అతడి కళ్ళముందు తిరుగుతున్నయి...

చిన్నప్పటినుండీ మేనమామకూతుర్ని ఇద్దామనుకున్నారు మహేష్‌కు...కానీ కాలేజీలో ఆ అమ్మాయికి "బాయ్‌ఫ్రెండ్" వున్నాడని తెలిసి ఆ అమ్మాయిని చేసుకోలేదతడు... అందుకు శిక్ష యిది అనుకున్నాడు.

ఏం చెయ్యా లిప్పుడు?...

ఇంటికిపోతే రమణి కన్నీళ్ళు భరించగల గుండెదిటవు లేదతడికి...తననోటిమీదుగా తను రమణ్ని వెళ్ళిపొమ్మనలేడు...అంతకంటే యీ రంపపుకోతతో ప్రశాంతంగా కాపురమూ చెయ్యలేడు...

ఇంతే ...చిన్నప్పటినుండీ ట్రాజిడీలంటే యిష్టపడ్డందుకు తన జీవితమే ఓ ట్రాజెడీ అయింది...



పార్కులోంచి జంటలు వెళ్ళిపోతున్నారు... చిక్కటి చీకటి, అతడి మనసును బాధ ఆక్రమించేసినట్లు ఆక్రమించింది...

ఈ రాత్రి ఎక్కడికి పోవాలి తను?...

ఇంటికి వెళితే తను ఏం చేస్తాడో కూడా తనకే తెలియదు.



పోనీ ఏ హోటల్లోనైనా గది తీసుకుంటే ?"...

ఈ వూళ్ళో యిల్లు పెట్టుకుని, హోటల్లో గది తీసుకుంటే అంతా ఏమంటారు ?...అందరూ ఆరాలు తియ్యరా ?...

'ఇతడి పెళ్ళాం పెద్ద కథానాయకురాలట రోయ్'... అంటూ తను వినీ వినకుండా అంటూవుంటే తను భరించడం అనేది కల్ల...

ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి ?...

ఆలోచిస్తూ అక్కడే ఆ సిమెంటు బెంచీ మీదే కూలబడిపోయ్యాడు...క్రమంగా చల్లబడుతోంది వాతావరణం...పది గంటలు దాటింది...

చలి ముదిరి ఎముకలు కొరికేలా వుంది..

కానీ మహేష్ లేవలేదు...

అతడి గుండెల్లో రేగుతున్న మంటలకు ఆ చలి హాయిగా వున్నట్లుంది...ఆ రాత్రి అంతా అక్కడే గడిపేశాడు...

చీకటితెరలు తొలిగిపోయి సూర్యోదయం అవుతోంది... కానీ ఆ చీకటే బాగుందతనికి... సూర్యోదయంతోబాటు సమస్యలు మొదలయ్యాయి...

ఆలోచించి ఆలోచించి చివరికి ఒక నిర్ణయానికి వచ్చాడు... పోస్టాఫీసు తీసీ తియ్యగానే

## దీపం చమురు

ఒక కవరుకొని, వుత్తరంవ్రాసి లోకల్ టపాలో వేశాను...

ముందురోజు సాయంత్రంనుండీ, కళ్ళల్లో వొత్తులు వేసుకుని భర్తకోసం ఎదురుచూస్తున్న రమణికి అందింది సెకండ్‌పోస్టులో వుత్తరం...

చించి చదివింది...

"ఓ రాధా రమణి...

ఇక నాకు నువ్వేమీ చెప్పవద్దు... చెప్పినా వినను... నాకంతా తెలిసింది... నా అడ్రసు తెలుసుకుని నాదగ్గరకువచ్చి కాళ్ళావేళ్లాపడి బ్రతిమిలాడి ఏవో కథలు చెప్పాలనుకొని, నీ పరువూ, నా పరువూ రచ్చకీడ్చకు... ఈ విషయం బయటపడడం నా కిష్టంలేదు... అందుకని నేనొక వుపాయం ఆలోచించాను... నామీద నీకే మాత్రమన్నా అభిమానం... పోనీ జాలిలాంటిది మిగిలివుంటె... రాత్రినుండీ నేను పచ్చిమంచినీళ్ళు ముట్టుకోలేదు...నేను గుక్కెడు కాఫీ నీళ్ళన్నా గొంతులో పోసుకోవాలనుకుంటే సాయంత్రం నాలుగు గంటలకు ఆఫీసు ప్యూనును ఏదో ఒకవంకమీద యింటికి పంపిస్తాను... ఇంట్లో నీ తాలూకు సామాన్లన్నీ తీసుకుని తలుపు తాళంవేసి తాళంచెవి అతడి దగ్గర యిచ్చిపంపించు...నువ్వు మీ పుట్టింటికివెళ్ళినా సరే లేదా నిన్నువలచి వంచింపబడి పిచ్చివాడై తిరుగుతున్న నీప్రియుడి దగ్గరకు వెళ్ళినాసరే... నాకభ్యంతరంలేదు... అయితే నాకంటమాత్రం మళ్ళీపడకు... నిన్ను పెళ్ళిచేసుకున్న నేరానికి హంతకు డనిపించుకుని వురికంబానికి ఎక్కేలా చెయ్యకు...నువ్వేమన్నా చెప్పదల్చుకున్నా మీ వూరువెళ్ళాక వుత్తరం వ్రాయి...

ఇట్లు

నీచేత వంచిపబడ్డ రెండవపిచ్చివాడు

ఆ వుత్తరం చదివి కొయ్యబొమ్మలా అయిపోయింది రమణి...తను తమాషాకు వల విసిరింది...ఈ వలలోతనే చిక్కుకుంటుందని అనుకోలేదు,తను...ఇప్పుడు చేయవలసిందేమిటి?... కనీసం కోర్టులో శిక్షవేసేటప్పుడు కూడా, ముద్దాయి తననిర్దోషిత్వాన్ని చెప్పుకోడానికి అవకాశం వుంటుంది... కానీ తనభర్త జరిగిన సంగతి చెప్పే అవకాశంకూడా యివ్వలేదు...

రాత్రినుండీ తనూ పచ్చిమంచినీళ్ళు ముట్టలేదు. రాత్రి అంతా భర్తకోసం చూస్తూ మేలుకునేవుంది... కళ్ళుజ్యోతుల్లావున్నాయి...కాళ్ళు తేలిపోతున్నాయి. నీరసంతో మంచం మీద వాలిపోయింది...

మళ్ళీ కళ్ళుతెరిచి చూసేసరికి, చిన్నముల్లు నాలుగుమీదా, పెద్దముల్లు పన్నెండుకు కొద్ది నిముషాల దూరంలోనూ వున్నాయి...

ఇక ఆలోచించలేదు రమణి...లేచి పర్సులో ప్రయాణానికి కావలసినంత డబ్బుతీసి పెట్టుకుని, యివతలకువచ్చి తలుపు తాళం వేసింది.. పక్కయింట్లో తాళం చెవియిస్తూ, "మా నాన్నగారికి కులాసాగా లేదని తెలిసింది. నే వెళ్ళుతున్నాను...ఆయన గానీ, ప్యూను కానివస్తే యిది యివ్వండి." అని చెప్పి వెళ్ళిపోయింది...

మహేష్ యింటికి వచ్చాడన్న మాటేగానీ, ఏదోబాధ అతడ్ని నిలువునా దహించేస్తోంది... ఎవరిమీదనో చెప్పలేని కసి, ద్వేషం...ప్రపంచాన్నంతా లుంగచుట్టి నిప్పుపుల్ల అంటించాలన్నంత అసహ్యం...

అతడికి ఆఫీసుకు పోబుద్ధి పుట్టటంలేదు... ఆఫీసులో ఎవరు ఎందుకు నవ్వినా, తన విషయం తెలిసిపొయ్యే నవ్వుతున్నారేమోనన్న అనుమానం పిశాచంలా వేధిస్తుంటే భరించలేక, మర్నాడు ఆఫీసు కెళ్ళినవాడు నాలుగురోజులు సెలవుపెట్టి వచ్చేశాడు...బయటికి వెళ్ళడం మానుకున్నాడు... పనిపిల్ల క్యారియరు తెచ్చిపెడితే, నాలుగు మెతుకులు ఎంగిలి పడటం...ఆ తర్వాత కిటికీ దగ్గర నిలబడి శూన్యంలోకి చూడ్డం...,యిదే దినచర్య అయింది...

నాలుగు రోజులు నాలుగు యుగాల్లా భారంగా గడిచాయి...

ఆ రోజు పోస్ట్‌మన్ ఒక కవరు యిచ్చి వెళ్ళాడు...కవరు చాలా బరువుగా వుంది... దస్తూరి రమణి దస్తూరియే...

అతడికి ఆ కవరు చింపి ముక్కలు చేసి, అగ్గిపుల్ల అంటించా లనిపించింది...

కానీ ఏమి రాసివుంటుంది ?...బహుశా తప్పు చేశాను...పరిస్థితులకు లోబడి అలా చెయ్యవలసి వచ్చింది...క్షమించండి...అని రాసిందా ?...

కుతూహలం జయించింది.. కవరుచింపాడు.,

"ప్రియమైన శ్రీవారికి

ఈపాటికి మీ కోపం కొంచెమైనా తగ్గి, కనీసం ఆ కోపాన్ని యీవుత్తరంమీదైనా చూపకుండా, సాంతం చదువుతారానే ఆశతో యిది వ్రాస్తున్నాను...

ఈ విషయం మీకు ముందే చెప్పవలసిందేమో...కానీ యింత దూరం వస్తుందనుకోలేదు నేను... అందుకే చెప్పలేదు మీతో...

అవి నేను కాలేజీలో చదివేరోజులు...

మా క్లాసులో ఎర్రగా, పొడుగ్గా, బక్కపలుచగా ఒకతడు వుండేవాడు. జులపాల జుట్టు ఎప్పుడూ ఎక్కడో పరద్యానంగా ఆలోచిస్తున్నట్టు కన్పించేవాడు...కిటికీలోంచి నీలాకాశంలోకి చూస్తూనో, దూరంగా కన్పించే పచ్చని పొలాలనో తప్ప పరిసరాలను గమనించేవాడు కాదు...

ఒకసారి క్లాసులో ఎవ్వరూ లేనప్పుడు,నాస్నేహితురాలు నీరద పుస్తకం అడగడానికివెళ్ళిపక్కన నిలబడితే, పరధ్యానంగావుండి అది గమనించలేదతడు.

మా నీరదకు కోపం వచ్చింది...తనను అవమానం చేసినట్లు బాధపడింది...

"అబ్బో భావకవిలా పెద్దఫోజు..."అంది.

నాకు దాన్నివుడికించా లనిపించింది...

"ఏమో భావకవేనేమో..." అన్నాను...

"ఆఁ......యిలాంటి మొహాలే కవిత్వం రాసేది...." విసురుగా అంది...

ఇప్పుడు రాయకపోతే యికముందు రాయచ్చా..."

"బెట్ కడ్తాను... ఈ మొహం కవిత్వం కాదు...ఒక్క కథరాస్తే చాలు,. నాపేరు మార్చుకుంటాను" అంది రోషంగా...

నా కెందుకో దాన్నిచూసేకొద్దీ వుడికించాలనే బుద్ధి ఎక్కువైంది...

"అయితే చూస్తుండు........ అతడు మహా రచయిత కాకపోతే నా పేరు మార్చేసుకుంటాను" అన్నాను నవ్వుతూ

ఆ తర్వాత ఆ విషయం నేను యించుమించు మర్చేపొయ్యాను మళ్ళీ ఒకరోజు మా నీరద నన్ను చూసి నవ్వుతూ,

"ఏమే నీ బాప్టిజమ్ ఎప్పుడేం అంది ?"

నాకర్థం కాలేదు...





ఆటోమెటిక్ 50 షాట్ల జర్మన్ మోడల్ రివాల్వర్

లైసెన్సు అవసరం లేదు.



ఈ 50 షాట్ల ఆటోమెటిక్ పిస్టల్‌తో దొంగలు, క్రూర మృగముల బారినుండి రక్షించుకోవచ్చును. పిక్నిక్, ట్రావెల్, డ్రామాలలో ఉపయోగపడుతుంది. పెద్ద మోత, మంట వచ్చును. ధర రు. 22/- వి. పి. పి. ఛార్జీలు రు. 3-50. 150 షాట్లు ఉచితం. అదనంగా 100 షాట్లు రు. 3/- లెదర్ కేసు రు. 5/-.

PARKER AGENCIES
(WAJ-22P)
Post Box No. 1279, DELHI-6.

"అదే... అతడు మహా రచయిత కాకపోతే పేరు మార్చుకుంటానన్నావుగా... చెప్పు... ఆ పోజుల్రాయుడు గేయం మాట, కథల మాట అటుంచు కనీసం పత్రికలో వుత్తరం కూడా రాసేట్టు కన్పడలేదు ....మరి నీ పేరు రమణి తీసేసి రావమ్మ పెట్టనా" అంది...

రెండు మూడుసార్లు ఆ విధంగానే గేలి చేసింది నీరద......అది అలా అంటున్నకొద్దీ, తమాషాకు అన్న ఆ మాట నిజం చెయ్యాలన్న పట్టుదల ఎక్కువైంది నాలో...

ఎన్నాళ్ళో ఆలోచించాను.

చివరికి ఒక ఉపాయం తట్టింది...మనిషిలోని సృజనాత్మక శక్తిని వెలికి తియ్యాలంటే ఒక సంచలనం కలిగించాలి......అమృతం లాంటిది కూడా పాలకడలిని మధిస్తేనే లభించింది...... అందుకనే నిద్రాణంగా వున్న అతడిలో అలజడి లేపి, అతడిలోని రచనాశక్తికి నేనే వుద్దీపన కలిగిస్తే......అనిపించింది......అనిపించడమే తడవుగా ముందు వెనుకలు ఆలోచించకుండా ఆచరణలో పెట్టేశాను.

మొదట్లో అతడు పొడిపొడిగా మాట్లాడే వాడు...

నేనే పట్టుదలగా సంభాషణను ప్రోత్సహించి సంభాషణను అతడికి పుస్తకాలంటే యిష్టమని గ్రహించి వాటిమీదకు మళ్ళించేదాన్ని...ఆ విధంగా క్రమంగా పరిచయాన్ని వృద్ధి చేసుకున్నాను...మా పరిచయం వృద్ధి అయ్యేకొద్దీ అతడిలో మార్పు రాసాగింది...ఎప్పుడూ పరధ్యాన్నంగా వుండేవాడు చలాకీగా తిరగడం మొదలుపెట్టాడు...అతడి కళ్ళల్లో క్రొత్తకాంతి క్రొత్త వుత్సాహం పెల్లుబకడం మొదలు పెట్టాయి...

క్రమంగా అతడు నన్నొదిలి పెట్టలేని స్థితికి వచ్చేడు.. నేను వీలున్నప్పుడల్లా కథలు వ్రాయమని ప్రోత్సహించేదాన్ని...దానికతడు...... "నీ కళ్ళల్లోకి చూస్తుంటేచాలు...అవే కథలు చెబుతాయి...యింకా కథ లెందుకు" అనేవాడు

నాకు ఒక్కోసారి అతడ్ని చూస్తే జాలి వేసేది...పాపం అమాయకుడ్నిచేసి ఆడించటం లేదుకదా...అనిపించేది . అయినా నా లక్ష్యం నన్ను ఆలోచించ నివ్వలేదు...ఒకటి రెండు సార్లు అతడిమీద జాలితో నేను అతడికి వశమయ్యే పరిస్థితులు వచ్చినా. నా లక్ష్యమే నన్ను నిలువరించుకునేలా చేసింది.

క్రమంగా అతడు నా ప్రేమలో పడి పిచ్చివాడే అయిపోతున్నట్లు అనిపించింది...అందుకే జాలివేసి ఒకటి రెండు రోజులు మొహం చూపించకుండా వుండేదాన్ని...మూడోరోజు నేను కనబడగానే నా చేతిలో ఒక కాగితం పెట్టాడు.. అది గేయం... ...నా అందాన్ని వర్ణిస్తూ గేయం...నా కన్నుల్లో తరళించే కాంతులమీద నా తలనుంచి వర్షించే సన్నజాజి సుమధూళిమీద యింకా ఏమేమిటో రాశాడు.

ఆ గేయం ఎండిపోతున్న నాఆశాలతకు నీళ్ళు పోస్తున్నట్లు చేసింది... అప్పటినుండీ నేను ఒక రోజు కనిపించకపోయినా, అలిగి మాట్లాడక పోయినా గేయాలు వ్రాసేవాడు.., నేను కలలో కన్పించినట్లు, సముద్రుడితో వాపోయినట్లు, సముద్రుడుకూడా తనతోబాటు ఏడ్చినట్లు ...... పార్కులోని మూగచెట్లు ఆకులతో మౌనంగా కన్నీరు తుడిచినట్లు...... ఏమేమిటో వ్రాసేవాడు...

వాటిని చూస్తే నాకు ఆనందంగా వుండేది... గర్వంగానూ వుండేది...

కానీ వాటిలో పరిపూర్ణతవచ్చినట్లుగా మాత్రం లేదు...

అప్పటికి గ్రహించాను... కవిత్వం వ్రాయడానికి ఒక్క సంచలనమేకాదు...ఒక ఆవేశం. ఒక ఆవేదన. ఒక తపనకూడా కావాలని... శోకంలోంచే శ్లోకం పుట్టిందంటారు అందుకే కాబోలు ననుకున్నాను...

అందుకే మీతో పెళ్ళికి సంతోషంగా వొప్పుకున్నాను... నేను ఏనాడూ అతని ప్రేమకోసం ప్రాకులాడలేదు కాబట్టేఅతడ్ని వంచిస్తున్నానన్న భావంకానీ, మిమ్మల్ని వంచిస్తున్నానన్న భావం కానీ రాలేదు...పైగా యికఅతడు పెద్దరచయిత అవగలడన్న ధైర్యంకూడా తోడయి చాలా ఆనందంకూడా కలిగింది...మనపెళ్ళికి నాస్నేహితురాండ్రు వచ్చినప్పుడుకూడా నేనెలాంటి తడబాటూపడలేదు ... తృప్తిగా ఆనందంగానే వున్నాను...

ఆ తర్వాత నేననుకున్న విధంగానే జరిగింది. కొన్నాళ్ళు మరీ పిచ్చివాడిలా తిరిగినట్లు తెలిసినా క్రమంగా తన కలం ద్వారా తన వేదనను, బాధను వెళ్ళబోసుకునేవాడు...పత్రికల్లో అతడి కథలు కానీ, గేయాలు కానీ, చూసినప్పుడు నా మనస్సు ఎంతగానో పొంగిపొయ్యేది...

ఇది నే వెలిగించిన దీపం...వత్తి వెలిగించబొయ్యేముందు వత్తిని నలిపి, అగ్గిపుల్ల అంటిస్తాం...అది వత్తిని బాధపెట్టడమే కావచ్చు. కానీ ఆ వత్తి వెలుగునివ్వాలంటే అలా చెయ్యక తప్పదు మరి...అని నేను పొరబాటు చేశానేమో అనిపించినప్పుడల్లా అలా సమర్థించుకునేదాన్ని...

కానీ నేను మరిచిపోయింది ఒక్కవిషయం... వత్తి తను కాలిపోతూ వెలుగు నిస్తుంది నిజమే కానీ...దానికి ప్రాణం పోసి వుద్దీపన కలిగించే దమురు కూడా క్రమక్రమంగా. తనఅస్తిత్వాన్ని కోల్పోతుంది.

నేను చేసిన పొరబాటు అదే...అతడికి దమురునైన నేను మీ జీవితానికి దీపం అవుదామనుకున్నాను...అందుకే యిలా అయింది మన బ్రతుకు... మీరు దీన్ని నమ్మండి...నమ్మకపోండి...కానీ జరిగిన నిజం యిది.

అయిన దానికి నేను పశ్చాత్తాపపడటం లేదు... నాకు మీ గురించే దిగులు...అనవసరంగా మిమ్మల్ని బాధపెట్టాను... మీ జీవితం నా మూలాన నాశనం కాకూడదు... మీరు నాకు డైవర్సు యిచ్చేసి యింకోర్ని వివాహం చేసుకుంటా నంటే నేనెలాంటి అభ్యంతరమూ చెప్పను... అలా అయితే నా గుండెల్లోని యీ రంపపు కోత కూడా తగ్గుతుంది.

లేదు. కొన్నాళ్ళు పొయ్యాక నా యీ పొరబాటును క్షమించ గలిగితే మీ రమణి యిక్కడే మీ కోసం ఎదురు చూస్తుంటుంది.

కానీ ఒక్క కోరిక... తెలిసో తెలియకో నా జీవితంలోని ఆనందాన్ని కూడా నాశనం చేసుకుని దివ్వె వెలిగించాను... ఆ వత్తిని, ఆ దివ్వెను అలాగే వెలగ నివ్వండి... ఆ వత్తిని ఆరిపోనివ్వకండి... ఎప్పుడైనా మురళీ మీకు తటస్థ పడితే, యీ విషయం దయచేసి అతనికి మాత్రం తెలియనివ్వకండి... యిదే నాకోరిక.

ఇట్లు

ఎప్పటికీ మీదే అయిన

రమణి."

ఉత్తరం చదవటం పూర్తిచేసి "హుఁ ...ఎంత కట్టుకథ అల్లింది!... నమ్ముతాననే కాబోలు..." అంటూ బుసకొట్టే పాములా వుత్తరం చింపబోతున్న మహేష్, బయట అడుగుల చప్పుడుకు ఆగిపొయ్యాడు.

ఆ వచ్చింది ఎవరో కాదు...

మురళీధర్!...

ఆనాడు అనాలోచితంగా అంత ఆవేశపడినందుకు మహేష్‌గారు ఎంత బాధపడ్డారోనని, నాలుగు రోజులు పొయ్యాక అనిపించింది మురళికి. క్షమాపణ చెప్పుకుందామని ఆఫీసుకువస్తే, సెలవుపెట్టి యింట్లో వున్నాడని తెలియగానే సరాసరి వచ్చేశాడు.

మురళిని చూడగానే మహేష్ ఆవేశంతో,

"మిమ్మల్నేకాదు... నన్నుకూడా మోసం చెయ్యాలనుకుంది రమణి . చూడండి...ఎంత కట్టుకథ అల్లిందో...కనీసం పొరపాటు జరిగింది...క్షమించమన్నా సంతోషించి వుండేవాడిని" అంటూ వుత్తరం చేతికందిచ్చాడు...

ఆ వుత్తరం పూర్తిగా చదివిన మురళీధర్ అయిపోయి పక్కనున్న పడక్కుర్చీలో వాలిపోయ్యాడు యిక నిలబడలేనట్లు...